సాక్షి
కుమురం భీం
సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



సీవోఈ ఫలితాల్లో జయకేతనం

సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) ప్రవేశపరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ: 6:31	మంగళ: 4:47

గరిష్టం/కనిష్టం
39.7 /28.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సైనిక్ శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మార్షల్ రవిచంద్ర జాబాడే

జైనూర్: సమతా సైనిక్ దళ్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమతా సైనిక్ దళ్ కేంద్ర సభ్యుడు మార్షల్ రవిచంద్ర జాబాడే అన్నారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 29 వరకు కెరమెరి మండల కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ శిలానంద్ కాంబ్లే, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాపేస్ బన్‌సోడే, రాష్ట్ర శిక్షణ అధికారి విక్రమ్ కాంబ్లే, బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ యూత్ నాయకులు సిద్దార్థ, సోన్‌కాంబ్లే, సత్యవాన్, ఘటనాకర్, అభయ్, కాంబ్లే అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్య భరిత ఆహారం అందించాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రుక్సాన

తిర్యాణి: చిన్నారులకు వైవిధ్య భరిత ఆహారం అందించాలని ఆసిఫాబాద్ ఐసీడీఎస్ సీడీపీవో సాధియా రుక్సాన సూచించారు. ఆదివారం మండలంలోని పంగిడిమాదార, చింతలమాదార, పంగిడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు లబ్ధిదారుల గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు పిల్లల కొలతల నమోదు రికార్డులు పరిశీలించారు. పిల్లల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె వెంట సుంగాపూర్ సెక్టర్ సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీలు కవిత, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

శివాజీ జయంతి అధికారికంగా నిర్వహించాలి

సిర్పూర్(టి): ఛత్రపతి శివాజీ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి అదేరోజు సెలవు దినంగా ప్రకటించాలని సిర్పూర్(టి) మండల ఆరె సంఘం అధ్యక్షుడు చిక్కుపురె శంకర్ ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దుర్గం భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నాయకులు రావి శ్రీనివాస్, దుర్గం భాస్కర్, తదితరులు ఉన్నారు.

ఆదివాసీ తెగలకు సామాజిక న్యాయం కల్పించాలి



మాట్లాడుతున్న ఆత్రం భీమ్‌రావు

ఆసిఫాబాద్: ఆదివాసీల్లోని ఐదు తెగలకు రాజకీయాల్లో సముచిత న్యాయం కల్పించి, సామాజిక న్యాయం చేయాలని కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాయ్‌సెంటర్‌లో ఆదివాసీల్లోని కొలాం, తోటి, పర్దాన్, నాయక్‌పోడ్, ఆంధ్ తెగలకు సంబంధించిన ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 75 ఏళ్లుగా ఆదివాసీ తెగల అభివృద్ధి పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఐదు తెగలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒకటి, రెండు తెగలను గుప్పిట్లో పెట్టుకొని మొత్తం ఆదివాసీలు తమతో ఉన్నట్లు భావిస్తున్నాయన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయాల్లో తమ వాటాకోసం రాజీలేని పోరాటానికి ఐక్యకార్యాచరణ చేయాలని నిర్ణయించామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయా తెగలు తీసుకోవాల్సిన నిర్ణయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు, పర్దాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సుధాకర్, ఆదిలాబాద్ అధ్యక్షుడు దుర్వా నరేశ్, నాయకులు మెస్రం బాబురావు, సట్ల అశోక్, సుభాష్, మడావి దత్తు, జయరాం, తిరుపతి, భీముడు, సిడాం అన్నిగా, భరత్, సంతోశ్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

అడవి తల్లి ఆసరా..

- ఉత్పత్తులతో ఆదివాసీలకు అండ..
- ఇప్పపూలు, జీడి గింజల సేకరణలో 'గిరి'జనం
- ఉపాధి పొందుతున్న అడవి బిడ్డలు



ఇప్పపూలు సేకరిస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): అడవులనే నమ్ముకుని.. అడవే ఆధారంగా జీవిస్తున్న ఆదివాసీలు తమ సంప్రదాయ అటవీ ఉత్పత్తులను మరవడం లేదు. అడవి తల్లి ఏదో ఒక రూపంలో వారికి ఆసరా కలిగిస్తోంది. ఇప్పపూలు, జీడిగింజలు, తునికిపండ్లు, మొర్రిపండ్లు, సారా పలుకులు అందిస్తూ వారిని కొంత ఆర్థికంగా బలపడేలా చేస్తోంది. వాటిని సేకరించేందుకు ఆదివాసీలు వేకువ జామునే నిద్ర నుంచి మేల్కొని పిల్లాపాపలతో కలిసి అడవిబాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కెరమెరి, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, వాంకిడి, తిర్యాణి, జన్నారం, దండేపల్లి, బోథ్, ఇచ్చోడ, బేల, బజార్‌హత్నూర్, బెజ్జూర్, సిర్పూర్(టి), తదితర గ్రామాలకు సమీపంలోని అడవుల్లో అటవీ ఉత్పత్తులు లభిస్తున్నాయి. ముఖ్యంగా కెరమెరి మండలంలో అధికంగా అడవులు ఉండడం వల్ల సాకడ, సాంగ్వి, కొప్పగూడ, పిట్టగూడ, కెలికే, లెండిగూడ, మెట్టపిప్రి, మోడీ, చాల్‌బడి, జోడేఘాట్, పాట్నాపూర్, తదితర గ్రామాల ఆదివాసీలు తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఇప్పపూలు, జీడిగింజలు సేకరించడంలో నిమగ్నమవుతున్నారు. మరికొద్ది రోజుల్లో తునికాకు సేకరణ కూడా ప్రారంభం కానుంది.

ఆర్థికంగా వెసులుబాటు

వేసవికాలం వచ్చిందంటే గిరిజనులకు పండుగే. ఈకాలంలో ఇప్పపూలు విరివిగా లభిస్తాయి. వేకువజామునే అడవికి వెళ్లిన ఆదివాసీలు ఇప్పపూల చెట్టుకింద గంటల తరబడి కూర్చుని వాటిని బుట్టలో ఏరుతారు. అనంతరం పూలను ఇంటికి తీసుకువచ్చి ఎండలో ఆరబెట్టి మార్కెట్లో విక్రయిస్తారు. ప్రస్తుతం అత్యధిక గ్రామాల్లో ఏ ఇంటికి వెళ్లినా ఇప్పపూలు ఆరబెట్టిన దృశ్యాలే మనకు కనిపిస్తాయి. కొందరు వీటిని విక్రయించి ఆర్థికంగా లాభపడుతుంటే, మరికొందరు వంట చేసుకుని ఆరగిస్తారు. కానీ ఇంత కష్టపడి సేకరించిన ఇప్పపూలకు మార్కెట్లో మాత్రం ఆశించినంత డిమాండ్ లేదు. జీసీసీ ఆధ్వర్యంలో గతంలో కిలోకు రూ.20 చొప్పున కొనుగోలు చేశారు. ఈ ఏడాది కిలోకు రూ.30 చొప్పున విక్రయిస్తామని పేర్కొంటున్నారు. ఎంతో కష్టపడి సేకరించిన ఇప్పపూలకు ఆశించిన ధర లేకపోవడంపై ఆదివాసీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



సేకరించిన ఇప్పపూలు

జీడి పండ్ల సేకరణ

వేసవికాలంలో అడవిలో లభించే పండ్లలో జీడి పండు ఒకటి. ప్రస్తుతం ఆదివాసీ మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలో జీడిపండ్ల సేకరణలో తలమునకలయ్యారు. చెట్టు చివరన కొమ్మలపై జీడిగింజ, దానికి అనుకొని ఉన్నకాయ కాసిన కొద్ది రోజులకు పసుపు రంగులోకి పండుగా మారుతుంది. వాటిని వెదురు కంకతో తెంపుతారు. నల్లగా ఉన్న గింజల నుంచి జాగ్రత్తగా పండును తుంచి ఆరబెట్టి తింటారు. అప్పటికప్పుడు తినాలంటే నిప్పుల్లో కాల్చి చల్లారిన తర్వాత తింటే ఎంతో రుచిగా ఉంటుంది. నల్లగా ఏర్పడిన జీడిని మార్కెట్లో విక్రయిస్తారు. జీడిగింజలు కిలో రూ.30కి మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు.



సేకరించిన జీడి గింజలు

క్వింటాల్ సేకరించా



మా చేనులోనే ఇప్పచెట్టు ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక క్వింటా ఇప్పపూలు సేకరించా. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇప్పపూలు ఏరడమే నాపని. ఈసారి తక్కువ మోతాదులో ఇప్పపూలు పడ్డాయి. కానీ ధరలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కుర్సెంగ భగీరథబాయి, చిన్నసాకడ

ధరలేకే తిప్పలు



జీడిగింజలు ఏరడంలో, తెంపడంలోనే చాలా ఇబ్బందులు ఉంటాయి. వెదురుతో గింజలను తెంపాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రెండు క్వింటాళ్ల జీడిగింజలు తెంపా. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు మార్కెట్లో విక్రయిస్తున్నా.

– పెందోర్ దుర్పతబాయి, సాకడ, కెరమెరి

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి



ఇప్పపూలు, జీడిగింజలు జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి. కొంత కాలంగా జీడిగింజల కొనుగోలు నిలిచిపోయింది. గతేడాది ఇప్పపూలను కూడా జీసీసీ కొనుగోలు చేయలేదు. ప్రైవేటులో జీడిగింజలు, ఇప్పపూలు కిలో రూ.30కి కొనుగోలు చేస్తున్నారు. కనీసం కిలో రూ.50కి కొనుగోలు చేయాలి.

– కోవ ఇందిర, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పేదలకు అండగా కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ లక్ష్యం
- ప్రజా, రైతు వ్యతిరేక పార్టీకి ఎందుకు ఓటేయాలి?
- కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క

కౌటాల: కాంగ్రెస్ రాష్ట్రంతోపాటు దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అన్నం పెట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలోని జగదాంబ గార్డెన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీతక్క హాజరై మాట్లాడారు. దేశంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీతో పేదలకు ఒక్క రూపాయి కూడా లబ్ధి కలుగలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, దేవుళ్ల పేర్లు చెబుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. గాంధీజీని చంపిన పార్టీ బీజేపీ అని ఆరోపించారు. బీజేపీ పాలనలో రైతులు రోడ్డున పడ్డారన్నారు. పంటలకు మద్దతు ధర కోసం ఢిల్లీలో ఆందోళన చేసిన రైతులను బీజేపీ ప్రభుత్వం కాల్చి చంపిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. పదేళ్లలో అభివృద్ధి చేయకుండా ప్రజా ప్రభుత్వాలను కూల్చిందని ఆరోపించారు. ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు ఏమీ చేయని బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్‌కు వేస్తే.. బీజేపీకే..

ఇక రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు కూడా ఓటు వేయొద్దని కోరారు. బీఆర్‌ఎస్‌కు వేస్తే బీజేపీకి వేసినట్లే అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవి ఆశించలేదని తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెద్మ బొజ్జుకు, ఆదివాసీ పేద బిడ్డ ఆత్రం సుగుణకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చిందని తెలిపారు. ఆదిలాబాద్ బీజేపీ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు ఒకరు దొర, మరొకరు ప్రజలకు దొరకడని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్య ఉండే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక మొదటి పర్యటన ఆదిలాబాద్ నుంచే ఉంటుందని తెలిపారు.

బీజేపీకి రైతుల ఉసురు..

తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం దాడులు చేసి చంపేస్తోందని, ఆపార్టీకి రైతుల ఉసురు తగులుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం ఎన్నో పోరాటలు చేశానని, తన పోరాటలను చూసి, మహిళను గుర్తించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు నా గెలుపును బహుమానంగా ఇవ్వాలనుకుంటున్నానన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోచుకుందని ఆరోపించారు. జీవో 317తో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిధులు లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు.

ప్యాకేజీ ప్రవీణ్‌కుమార్

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్యాకేజీ ప్రవీణ్‌కుమార్ అని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కుట్రలో భాగంగా తాను ఓడిపోయానని తెలిపారు. ఆర్‌ఎస్పీ బడుగు బలహీనవర్గాలను మోసం చేశాడని ఆరోపించారు. కేసీఆర్ వద్ద ఉన్న రూ.1,400 కోట్ల ఆస్తిని లాక్కునేందుకే ఆర్‌ఎస్పీ బీఆర్‌ఎస్‌లో చేరాడన్నారు. ఆర్‌ఎస్పీ బీఆర్‌ఎస్‌లో చేరిన వెంటనే కవిత అరెస్ట్ అయిందన్నారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి కాంగ్రెస్‌లో చేరగా మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు మాజీ సర్పంచులు, పలువురు నాయకులు పార్టీలో చేరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు, సిర్పూర్, ఆసిఫాబాద్ పార్టీ ఇన్‌చార్జీలు రావి శ్రీనివాస్, శ్యాంనాయక్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ దుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ సభ్యులు డొంగ్రి అనూష, దుబ్బుల శ్రీదేవి పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఘనస్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాలకు వెళ్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఆదివారం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత



ఫ్లాగ్‌మార్చ్ ప్రారంభిస్తున్న డీఎస్పీ

కాగజ్‌నగర్‌రూరల్: శాంతిభద్రతలు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద నుంచి సీఆర్‌పీఎఫ్ భద్రతా బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌ను డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ చౌరస్తా, రాజీవ్ చౌరస్తా, బాలాజీనగర్, అంబేద్కర్‌చౌక్, పొట్టి శ్రీరాములు చౌరస్తా, సంఘంబస్తీ మీదుగా సర్‌సిల్క్, విజయబస్తీ, ఈద్గా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఫెమిలైజేషన్ ఎక్సర్సైజ్‌లో భాగంగా ఈ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి వర్గవిభేదాలు, అల్లర్లు లేకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు, కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాకేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సంతోశ్‌కుమార్, పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సైలు అంజయ్య, మహేందర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- డీడీఎన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ



పంచాంగం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ధూప దీప నైవేద్యం పథకంలో పనిచేస్తున్న అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో క్రోధినామ సంవత్సర పంచాంగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల 5వ తేదీలోగా వేతనాలు విడుదల చేయాలని, అక్టోబర్‌లో నియమించిన అర్చకులకు వేతనాలను చెల్లించాలని, కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌శర్మ, కోశాధికారి సంతోష్‌శర్మ, ఉపాధ్యక్షుడు తిరుపతిచారి, గౌరవ అధ్యక్షుడు మహేశ్‌శర్మ, ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి ప్రశాంత్, అర్చకులు విజయ్‌కుమార్, సూర్యనారాయణ, కులకర్ణి బాపుదేవ్, అభయ్‌కుమార్, సతీష్, శంకరయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు అందని ప్రోత్సాహకం

- మూడేళ్లుగా విడుదలకాని ఎంసీహెచ్ నిధులు
- ప్రభుత్వం మారినా నిధుల విడుదలలో జాప్యం
- జిల్లాలో 48,101 మందికి పెండింగ్
- ఎదురుచూపుల్లో లబ్ధిదారులు

మూడేళ్లుగా కిట్ డబ్బులు రావాల్సిన వారు	
2021–22	16,771
2022–23	18,128
2023–24	13,202




బాలింతకు కిట్ అందజేస్తున్న అధికారులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచడం, శిశు మరణాలను తగ్గించడమే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) కిట్ పథకాన్ని నిధుల కొరత వెంటాడుతోంది. గర్భిణులు, బాలింతలుగా ఉన్నప్పుడు అందించాల్సిన సాయం మూడేళ్లు కావస్తున్నా అందడంలేదు. జిల్లాలో 48,101 మంది కిట్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు.

నాలుగు విడతల్లో..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఇటీవల ప్రభుత్వం మారడంతో పథకానికి ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చారు. ఈ పథకంలో భాగంగా నాలుగు విడతల్లో ప్రోత్సాహకాన్ని అందిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణిగా పేరు నమోదు చేసుకుని వైద్యపరీక్షలు చేయించుకోవడం, సర్కారు దవాఖానాల్లోనే డెలివరీ చేయించుకోవడం, బిడ్డకు సకాలంలో టీకాలు వేయిస్తే ఈ పథకం కింద ఆర్థిక సాయం అందుతుంది. మగబిడ్డ జన్మిస్తే రూ. 12 వేలు, ఆడశిశువు జన్మిస్తే రూ.13 వేలు ప్రభుత్వం అందిస్తుంది. అయితే మూడేళ్లుగా ఈ పథకానికి నిధులు మంజూరు కావడంలేదు. దీంతో ప్రోత్సాహకం డబ్బుల కోసం తల్లులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మొదట్లో పథకం సక్రమంగా అమలుకావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ రానురాను నిధుల కేటాయింపుపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోతున్నారు. తమ చేతుల్లో ఏమి లేదని, కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతాయని వైద్యశాఖ అధికారి పేర్కొంటున్నారు. 2021–22 సంవత్సరానికి 18,313 మంది అర్హుల్లో కేవలం 1,542 మందికి మాత్రమే ఆర్థికసాయం అందింది. అప్పటి నుండి నేటి వరకు ఒక్కరికి కూడా నిధులు మంజూరు కాకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. అంతే కాకుండా 2023– 24 సంవత్సరంలో జిల్లాలో 3,469 ప్రసవాలుకాగా ఇప్పటి వరకు 2,236 మందికి కిట్‌లు అందజేశారు. ప్రస్తుతం కిట్‌ల కొరత ఏర్పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కిట్‌కు నిధులు మంజూరు చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఏడాదిగా ఎదురుచూస్తున్నా



ఏడాది క్రితం ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేయించుకున్నా. రూ.12 వేలు ఇప్పటి వరకూ అందలేదు. అప్పట్లో కేసీఆర్ కిట్‌లో భాగంగా పలు వస్తువులు ఇచ్చారు. బాబుకు ఏడాది వయస్సు వచ్చినా నేటికి కిట్, డబ్బులు కూడా రాలేదు.

– ప్రియాంక ఆమ్టే, ఆసిఫాబాద్

బాబుకు మూడేళ్లు వచ్చాయి



ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుని అక్కడే డెలివరీ అయ్యా. బాబుకు మూడేళ్లు దాటినా ఇప్పటి వరకు రావాల్సిన డబ్బులు రాలేదు. ప్రభుత్వం త్వరగా డబ్బులు ఇప్పించాలి.

– ఉజ్వల, ఖమానా, వాంకిడి

ప్రభుత్వ నిర్ణయం మేరకు అందిస్తాం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయిన లబ్ధిదారులకు రావాల్సిన డబ్బుల వివరాల జాబితాను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుండి ఉత్తర్వులు రాగానే లబ్ధిదారులకు అందించే ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం నిర్ణయం మేరకు నడుచుకుంటాం.

– తుకారాం భట్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో గంజాయిని శనివారం రాత్రి పట్టుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పక్కా సమాచారంతోనే గ్రామానికి చెందిన బండం రాజు కిరాణా దుకాణంలో దాడి చేసి 500 గ్రాముల ఎండిన గంజాయితోపాటు స్మోకింగ్ రోలింగ్, కోన్స్ పేపర్లు లభించినట్లు తెలిపారు. అతని స్నేహితులు ఇర్ఫాన్, బిలాల్‌తో కలిసి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నారని పేర్కొన్నారు. వీరిని అదుపులో తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామానికి చెందిన రాటి సురేష్ (30) మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చెన్నూర్ ఏఎస్సై మజీద్ కథనం ప్రకారం.. సురేష్ సోమవారం హోళీ రోజున గ్రామ సమీపంలోని బ్యారేజీలో చేపలు పట్టుకుని వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న సురేష్ చేపలు ఫ్రై చేసేందుకు కట్టెల పొయ్యిపై కంచుడులోని నూనెలో వాటిని వేసే క్రమంలో ప్రమాదవశాత్తు చేయి తగిలి మరిగిన నూనె ముఖంపై పడింది. తీవ్ర గాయాలైన అతన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అటు నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదును ఎస్ఎస్‌టీ అధికారులకు అప్పగిస్తున్న సీఐ, ఎస్సైలు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన అల్లివర్ అర్జున్ బోలెరో ఆపి తనిఖీ చేయగా లభించిన రూ.98,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ఎస్ఎస్‌టీ సిబ్బందికి అప్పగించి కేసునమోదు చేసినట్లు కాసిపేట ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఎస్ఎస్‌టీ సిబ్బంది, డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వడదెబ్బతో హమాలీ కార్మికుడి మృతి



సురేశ్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన లెంకె సురేశ్ (40) వడదెబ్బతో ఆదివారం మృతిచెందారు. గత కొంతకాలంగా భార్యపిల్లలతో దూరంగా ఉంటున్న సురేశ్ హమాలీ కార్మికుడిగా పనిచేస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నారు. ఈమేరకు పట్టణ ఎస్సై అంజన్న.. మృతదేహాన్ని స్థలాన్ని పరిశీలించి వడదెబ్బతో మృతిచెంది ఉంటాడని తెలిపారు.

సీఓఈ ఫలితాల్లో జయకేతనం

- 14 మంది విద్యార్థులకు దక్కిన సీట్లు
- అభినందించిన ఆర్‌సీఓ స్వరూపారాణి



బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం ముఖద్వారం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) ప్రవేశపరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం రెండువిడతల్లో పరీక్షలు నిర్వహించారు. బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 74 మంది విద్యార్థులు మొదటి దశ పరీక్ష రాయగా వీరిలో 53 మంది రెండో దశ పరీక్షకు అర్హత సాధించారు. వీరిలో 14 మంది విద్యార్థులు ప్రీమియర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కళాశాలల్లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. విజయం సాధించిన వారు ప్రతిష్టాత్మకమైన గౌలి దొడ్డి, చిల్కూర్, షేక్‌పేట, అల్గునూర్, ఇబ్రహీంపట్నం సీఓఈల్లో సీట్లు దక్కడం విశేషం. కాగా ఉమ్మడి జిల్లాల్లో ఉన్న సీఓఈల్లో అడ్మిషన్లకు మలి దశ వెలువడనున్న ఫలితాల్లో మరో 15 సీట్లు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

సీటు సాధించిన విద్యార్థులు వీరే..

రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధిగాంచిన ప్రీమియర్ సీఓఈల్లో బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం విద్యార్థులు అధిక సీట్లు సాధించి విజయ దుందుభి మోగించారు. అల్లాటి వినయ్, మేరుగు అజయ్‌కుమార్, దాగం సాయి సిద్దార్థ్, గుమ్మడి ఉజ్వల్, దుగుట సామిత్, దుర్గం నవీన్, గోమాస అభిషేక్, బొల్లం అభినవ్ తేజ్ (బైపీసీ–గౌలిదొడ్డి) ప్రీమియర్ సీఓఈలో సీటు దక్కించుకున్నారు. జాడి ప్రఫుల్, గొల్లమాడ చక్రధర్(బైపీసీ), చిలుముల రాకేశ్, దుర్గం కార్తీక్ (ఎంపీసీ) కరీంనగర్ అల్గునూర్ సీఓఈలో సీటు సాధించగా, సూర్యవంశీ కరణ్‌కుమార్ (ఎంపీసీ) చిల్కూర్, బక్కం సాయి విఘ్నేష్ (ఎంపీసీ) అల్గునూర్) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో సీటును కైవసం చేసుకున్నారు.

సీఓఈల్లో జాతీయస్థాయి పోటీ పరీక్షలకు తర్ఫీదు

సీఓఈల్లో సీటు వచ్చిన విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యార్థులతో సరిసమానంగా విద్యాబోధన జరుగుతుంది. ఉచితంగా ఇంటర్మీడియెట్ విద్యతోపాటు ఐఐటీ, నీట్, క్లాట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు. నాణ్యమైన శిక్షణ ఇస్తూ ఏటా వందల సంఖ్యలో డాక్టర్లు, ఇంజినీర్లను తయారు చేస్తుండటంతో సీఓఈల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రత్యేక క్రేజీ ఏర్పడుతోంది. ఈకారణంగానే సీఓఈల్లో అడ్మిషన్ కోసం నిర్వహిస్తున్న ప్రవేశపరీక్షకు లక్షకుపైబడి మంది పోటీ పడుతున్నారు. ఈసారి తీవ్ర పోటీ ఉండి 14 మంది విద్యార్థులు సీఓఈలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ కొప్పుల స్వరూపారాణి అభినందించారు.

సీఓఈలో సీటు రావడం ఆనందంగా ఉంది



ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో నెగ్గి సీటు సాధించడం ఆనందంగా ఉంది. ఎంతో పట్టుదలతో పరీక్ష రాశాను. ఆశించినట్లుగానే నాకు సీటు రావడం నాలో ఎనలేని ధైర్యాన్ని నింపింది. ఇదే స్ఫూర్తితో ఇంటర్మీడియెట్ చదువుతాను. ఉన్నత విద్యను చదివి డాక్టర్ అవుతాను.

– అల్లాటి వినయ్, విద్యార్థి

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే



సీఓఈ పోటీ పరీక్షలకు మా ఉపాధ్యాయులు ముందస్తు గానే ప్రిపేర్ చేశారు.ప్రణాళిక బద్ధంగా రోజువారీగా చదివించారు. ఉపాధ్యాయులు చెప్పినట్లుగానే పట్టుదలతో చదవడం వల్ల ఫలితం దక్కింది. నాకు బైపీసీలో సీటు రావడం సంతోషాన్నీ కలిగించింది.నాకు సీటు రావడం వెనకాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతగానో ఉంది.

– మెరుగు అజయ్‌కుమార్, విద్యార్థి

భవిష్యత్‌ను చక్కదిద్దుకుంటా



గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతోంది. పోటీ పరీక్షలు రాయడానికి ఉపాధ్యాయులు అందిస్తున్న తోడ్పాటు ఎన్నటికీ మర్చిపోలేం. సీఓఈలో చదవడం వల్ల నా భవిష్యత్ మారుతుందని ఆశిస్తున్నా.

– దాగం సాయి సిద్దార్థ్, విద్యార్థి

ఐఐటీలో సీటు సాధిస్తా



సీఓఈలో సీటు రావడం గొప్పవరం. ఆ క్రెడిట్ అంతా ఉపాధ్యాయులకే దక్కుతుంది. పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రిపేర్ చేస్తూనే మరో పక్క సీఓఈ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేశారు. సీఓఈలో శ్రద్ధగా చదివి ఐఐటీలో సీటు సాధిస్తా.

– దుర్గం కార్తీక్, విద్యార్థి

ఆనందంగా ఉంది



ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన శిక్షణ ఇచ్చారు. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేశారు. ఈసారి ఏకంగా 14 మంది విద్యార్థులు ప్రీమియర్ సీఈఓల్లో సీటు సాధించడం ఆనందంగా ఉంది. ఉమ్మడి జిల్లాల సీఓఈల్లో మరో 15 వరకు సీట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్ బెల్లంపల్లి

రైతుల పక్షాన కాంగ్రెస్

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: రైతుల పక్షాన కాంగ్రెస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే కరువు వచ్చిందని బీఆర్‌ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ని ఓడగొట్టినా మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, పలువురు రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రైతుల పంటలకు కోత విధించి, ఏటా రూ.40 కోట్లకు పైగా దోచుకున్నారని అన్నారు. మంచిర్యాల, అంతర్గాంల మధ్య గోదావరి నదిపై నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ. 164 కోట్లతో టెండర్లు నిర్వహించిందన్నారు. ఆ బ్రిడ్జి నిర్మాణం సింగిల్ లైన్‌తో నిర్మించేలా రూపొందించారన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు అంతర్గాం వైపు 30 ఎకరాల భూమి ఉండగా, దానిని డెవలప్ చేసేందుకే బ్రిడ్జి నిర్మాణం పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ముల్కల్ల వద్ద నేషనల్ హైవే వారి సహకారంతో 70 శాతం నిధులు కేంద్రం నుంచి, మిగతావి రాష్ట్ర నిధులతో నాలుగు లైన్లతో కూడిన బ్రిడ్జిని నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే ఐబీ ఆవరణలోని భవనాలు తొలగించి 600 పడకలతో ఎంసీహెచ్‌తోపాటు ఆస్పత్రి భవనం నిర్మిస్తామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని 13, 25 వార్డుల్లో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, వేణు, మంచిర్యాల వైస్ చైర్మన్ సల్ల మహేశ్, చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ పాల్గొన్నారు.

ఆర్కేపీ సీహెచ్‌పీ మరో రికార్డు

- ఒక్కరోజులోనే ఏడు రేకుల బొగ్గు రవాణా



రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ(ఫైల్)

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ కార్మికులు అద్భుతమైన రికార్డులను సృష్టిస్తున్నారు. బొగ్గు రవాణాలో కీలకంగా వ్యవహరించి ఈ ఆర్థిక సంవత్సరం అత్యధిక రేకుల సరఫరా చేసి గతంలో ఉన్న పలు రికార్డులను బద్దలు కొట్టారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 22 లక్షల 3 వేల టన్నుల లక్ష్యాన్ని ఇక్కడి సీహెచ్‌పీకి నిర్దేశిస్తే వారం రోజుల ముందుగానే నిర్దేశిత లక్ష్యం కన్నా 7 లక్షల టన్నుల బొగ్గు అధనంగా రవాణా చేసి రికార్డును సృష్టించారు. మొత్తం 130 శాతం బొగ్గు రవాణా చేసి సత్తాచాటారు. అలాగే మార్చి 30న(శనివారం) ఒక్కరోజే ఏడు రేకుల బొగ్గు రవాణా చేశారు. దాదాపు 28 వేల టన్నుల బొగ్గును ఒక్కరోజులోనే రవాణా చేసి శభాష్ అనిపించుకున్నారు. సమష్టి కృషితో అత్యధిక టన్నుల బొగ్గును సకాలంలో రవాణా చేస్తున్న సీహెచ్‌పీ కార్మికులను ఏరియా జీఎం మనోహర్, సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి అభినందించారు.

కాంగ్రెస్‌లోకి టీబీజీకేఎస్ ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు



కండువా కప్పుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కౌటాల పర్యటనకు వెళ్తున్న సందర్భంగా మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో సదాశివ్ కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు సదాశివ్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

కారు బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన కారు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బురుగుడా బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చిలాటిగుడా గ్రామానికి చెందిన సచిన్, చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన తిరుపతి బైక్‌పై వస్తుండగా మంచిర్యాల వైపు నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సచిన్, తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి పంపించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడలో గల ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి దాడి చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.6,600 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక సెల్‌ఫోన్‌తో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

108లో ప్రసవం



జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన గర్భిణి శ్యామల 108 అంబులెన్స్‌లో ప్రసవించి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు ఆదివారం 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వాహనంలో ఆమెను జన్నారానికి వస్తున్నారు. మార్గమధ్యలో పురిటినొప్పులు రావడంతో వాహనంలో ప్రసవించగా పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను జన్నారం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు 108 సిబ్బంది ఈఎంటీ కిషన్, పైలట్ రఫిక్ తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కౌటాల: హోలీ సందర్భంగా మండలంలోని తాటిపల్లి వద్ద వార్ధా నదిలో స్నానాలకు వెళ్లి యువకులు మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత తల్లిదండ్రులు ఆదివారం కౌటాలలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్కను కలిశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఆ సమయంలో వారు బోరున విలపించగా మంత్రి వారి కన్నీటిని తుడిచి ఓదార్చారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఆదివాసీ నాయకులు, పంచాయతీ కార్మికులు, ఐకేపీ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందించారు. పారంపోగు భూములకు పట్టాలివ్వాలని పలువురు రైతులు వినతిపత్రాలు ఇచ్చారు.

తేలని కాస్నూర్ మిగులు భూములు

- నిజాం పాలనలో పంటలు పండించిన కాస్నూర్ రైతులు
- వివాదాస్పదంలో 2400 ఎకరాల భూములు
- మరో పోరాటానికి సిద్ధమవుతున్న భూ పోరాట సమితి



కాస్నూర్ శివారులో వివాదాస్పదంగా ఉన్న భూములు

జైపూర్: 35 ఏళ్లుగా కాస్నూర్ రైతులు ఇక్కడి ప్రజలు మిగులు భూముల సాధన కోసం పోరాటం చేస్తున్నారు. తమ భూములకు హక్కులు కల్పించాలని పోరాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను భూపోరాట సమితి నాయకులు తీసుకెళ్లారు. నిజాం పాలనలో అంకన్నపాడ్ చెరువు కింద వెయ్యి ఎకరాలకుపైగా భూముల్లో రైతులు పంటలు సాగు చేశారు. తాతలు, ముత్తాతల కాలంలో కాస్నూర్ శివారు భూముల్లో వ్యవసాయం చేసేవారు. 1969లో రాజపత్రం ప్రకారం సెక్షన్–4 ద్వారా కాస్నూర్ శివారు భూములు (కాస్నూర్ బ్లాక్) మొత్తాన్ని రక్షిత అటవీ ప్రాంతం పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రస్తావించింది. కాస్నూర్ శివారులో గల అప్పటి సెతువార్ పట్టాప్రకారం సర్వే నెంబర్ 132/11లో అటవీశాఖ ఆధీనంలో 2,400 ఎకరాలకు పైగా భూమి ఉంది. 1969 గెజిట్ ప్రకారం సెక్షన్–4లో ప్రస్తావించింది. వాస్తవానికి 797 ఎకరాలు మాత్రమే అంటే మిగిలిన 1,600 ఎకరాల మిగులు భూములపై కాస్నూర్ వాసులు పోరాటం మొదలైంది. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా కాస్నూర్ వాసుల తలరాతలు మాత్రం మార్చే నాథుడే కరువయ్యాడు. ఆ భూములపై ఆధారపడ్డ రైతులు..భూమి లేని పేద ప్రజలు ఏళ్లుగా మిగులు భూములపై పోరాటం చేస్తున్నారు. ఉన్నా ఊరిలో ఉపాధి కరువై పట్టణ ప్రాంతాలకు వలస కూలీగా వెళ్తున్నారు. ప్రభుత్వాలు.. పాలకులు మిగులు భూములపై దృష్టిసారించకపోవడం దశాబ్దాలుగా భూ సమస్య కొలిక్కిరాని పరిస్థితి. అటవీ–రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించినా మిగులు భూముల లెక్క తేల్చని పరిస్థితి నెలకొంది. 2008లో గ్రామ సభ నిర్వహించి అటవీ అధికారులు, కాస్నూర్ గ్రామస్తులు ఆ వివాదాస్పద భూములపైకి వెళ్లకూడదని నిర్ణయించి జాయింట్ సర్వే నిర్వహించినా తర్వాత మిగులు భూములు తేలుస్తామని అప్పటి ఉమ్మడి జిల్లా జాయింట్ కలెక్టర్ చెప్పారు. 14 ఏళ్లు గడుస్తున్నా సమస్య కొలిక్కి రాలేదు. కాస్నూర్ బ్లాక్‌పై కన్నేసిన అటవీశాఖ భూముల్లో అటవీ అభివృద్ధి పనులు చేపట్టడం కాస్నూర్ వాసులు అడ్డగించడంతో రాష్ట్రస్థాయికి కాస్నూర్ భూ సమస్య చేరింది. గత ప్రభుత్వం పట్టింపు చేయకపోవడంతో సమస్య కొల్కిరాకపోగా, మరో ఉద్యమానికి కాస్నూర్ భూ పోరాట సమితి సిద్ధమవుతోంది.

కాస్నూర్ వాసుల తలరాతమరేనా..

కాస్నూర్ గ్రామస్తులు మిగులు భూముల కోసం 35 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. గ్రామశివారులో 132 పీపీ, 132–11, 106, 107, 139 సర్వే నెంబర్‌లో సుమారు 1,600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామంలో అధికశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన నిరుపేద కుటుంబాలు ఉన్నాయి. వంద మందికిపైగా ఈ భూముల్లో పట్టాలు సైతం ప్రభుత్వం ఇచ్చింది. అయితే భూ వివాదం నెలకొనడం ప్రయోజనం లేకుండా పోతుంది. ప్రభుత్వ భూమి తేల్చి భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని ఇక్కడి ప్రజల ప్రధాన డిమాండ్. తాతలు, ముత్తాతల కాలంలో ఆ భూముల్లో పంటలు సాగు చేశారని నేటికి అక్కడ అనవాళ్లు ఉన్నట్లు వారు చెబుతున్నారు. ఏళ్లుగా అటవీ అధికారులు గ్రామస్తులకు మధ్య వివాదం నడుస్తోంది. గ్రామస్తులపై కేసులు పెట్టినా వారు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

1969 గెజిట్ ప్రకారం సెక్షన్–4లో ప్రస్తావన..

కాస్నూర్ శివారులో గల సర్వేనెంబర్ 132/11లో 1,481 ఎకరాల భూమి ఉండగా 1969 గెజిట్ ప్రకారం సెక్షన్–4 ద్వారా 797 ఎకరాల భూమిని రక్షిత అటవీ ప్రాంతం పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రస్తావించింది. సర్వే నెంబర్ 132/11 ఉన్న 1,481 ఎకరాల్లో కేవలం 797 ఎకరాలు మాత్రమే సెక్షన్–4 లో ప్రస్తావించగా అందులో మిగులు భూమితోపాటు సర్వే నెంబర్ 132(పీపీ) 982 ఎకరాలు, 106లో 24 సెంట్లు, 107లో 36 సెంట్లు, 136లో నాలుగెకరాల 22 సెంట్లు అటవీశాఖ ఆధీనంలో ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వాస్తవానికి ఇందులో నైజాం కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన మురళీ మనోహర్‌రావుకు 70 ఎకరాలు పట్టా భూమి ఉంది. సెక్షన్–4లో ప్రస్తావించిన భూమి పోగా మిగులు భూమి పంపిణీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం సెక్షన్–4, సెక్షన్–15తో సమానమని అటవీప్రాంతంలో పట్టా భూములు ఉంటే ప్రభుత్వం వారికి నష్టపరిహారం చెల్లించి ఆ భూములను అటవీశాఖకు అందినట్లుగా చెబుతున్నారు.

పోరాటం చేస్తాం



కాస్నూర్ మిగులు భూముల కోసం పోరాటం చేస్తాం. వేల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉన్నా ఇక్కడి రైతులు, ప్రజలకు ప్రయోజనం లేకుండాపోతోంది. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. మరో పోరాటానికి సిద్ధం అవుతున్నాం. మిగులు భూములు సాధించేవరకు పోరాటం చేస్తాం.

– బత్తుల శ్రీనివాస్‌యాదవ్, కాస్నూర్ భూ పోరాట సమితి అధ్యక్షుడు

నవోదయకు విద్యార్థుల ఎంపిక



హరిప్రియ



చరణ్‌తేజ్

కౌటాల: మండల కేంద్రంలోని మయూరి విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఆదివారం వెలువడిన ఆరో తరగతి నవోదయ ప్రవేశపరీక్షల్లో ఫలితాలు సాధించి ఎంపికయ్యారని కరస్పాండెంట్ యాదగిరి తెలిపారు. కౌటాలకు చెందిన దుర్గం రాజేశ్వరి–మీన దంపతుల కుమార్తె హరిప్రియ, కౌటాలకు చెందిన ఆలం అరుణ్‌కుమార్–ఈశ్వరి దంపతుల కుమారుడు చరణ్‌తేజ్ నవదోయలో సీటు సాధించారు. పాఠశాల హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు ఈ సందర్భంగా హరిప్రియ,చరణ్‌తేజ్‌ను అభినందించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వాంకిడి: మద్యానికి బానిసైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొడప రాము(25)కు రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన రంబబాయితో వివాహం జరిగింది. కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. హోలీ పండుగ రోజు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసైన రాము ప్రతీరోజు తాగి వచ్చి ఇంట్లో తల్లి మెంగుబాయితో గొడవపడేవాడు. భార్యను నువ్వే ఏదో అని ఉంటావు అందుకే పుట్టింటికి వెళ్లిపోయిందని తల్లిని కొట్టేవాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం గ్రామస్తులతో కలిసి చేపలు పట్టేందుదు గ్రామసమీపంలోని వాగు వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి అత్తారింటికి వెళ్లాడు. రాత్రి అక్కడే భోజనం చేసి నిద్రపోయాడు. ఆదివారం తెల్లవారుజాము తన ఇంటికి వచ్చాడు. ఉదయం 7 గంటల సమయంలో తల్లి మెంగుబాయి ఇంట్లోకి వెళ్లి చూడగా రాము ఉరేసుకుని దూలానికి వేలాడుతూ కనిపించాడు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంత్రి వస్తున్నారని..



రోడ్డుపై నీళ్లు పడుతున్న సిబ్బంది

కౌటాల: కౌటాల–టేకంగూడ వరకు దాదాపు 8 కి.మీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గత అక్టోబర్‌లో పాలకులు భూమి పూజ చేశారు. రోడ్డును తవ్వి కాంట్రాక్టర్లు కంకర వేశారు. దీంతో దుమ్ముతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లు కంకర పై నీళ్ల పట్టడం లేదు. ఆదివారం మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా దుమ్ము లేవకుండా రోడ్డుపై నీళ్ల పట్టారు. కౌటాలలోని జగదాంబ గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆ రోడ్డు గుండానే మంత్రి హాజరయ్యారు. మంత్రులు, అధికారులు వచ్చిన సందర్భాల్లోనే కాకుండా రోడ్డు పూర్తయ్యే వరకు దుమ్ము లేవకుండా నీళ్ల పట్టాలని ప్రజలు కోరుతున్నారు.